
ప్రజాస్వరం
PRAJASWARAM తెలుగు దినపత్రిక
Bullet Edition
శనివారం 15 నవంబరు www.prajaswaramdaily.com 4 pm


# తెలంగాణ హైకోర్టు వెబ్‌సైట్ హ్యాక్



**పోలీసులకు రిజిస్ట్రార్ ఫిర్యాదు**

హైదరాబాద్: తెలంగాణ హైకోర్టు వెబ్‌సైట్‌ను సైబర్ నేరగాళ్లు హ్యాక్ చేశారు. ఆర్డర్ కాపీలు డౌన్‌లోడ్ చేస్తుండగా ఆన్‌లైన్ బెట్టింగ్ సైట్ తెరచుకుంది. దీనిపై హైకోర్టు రిజిస్ట్రార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పీడీఎఫ్ ఫైల్స్‌కు బదులుగా బీడీజీ స్లాట్ బెట్టింగ్ సైట్ వస్తోందని పేర్కొన్నారు. హైకోర్టు వెబ్‌సైట్ హ్యాక్‌పై సైబర్ క్రైమ్ పోలీసులు కేసు నమోదు చేశారు.

**సీపీ సజ్జనార్ ఫేస్‌బుక్ ఖాతా కూడా**

తన పేరుతో నకిలీ ఫేస్‌బుక్ ఖాతా సృష్టించారని, ఆపదలో ఉన్నానని డబ్బు పంపాలని మెసేజ్‌లు పంపిస్తున్నారని హైదరాబాద్ సీపీ సజ్జనార్ తెలిపారు. ఇప్పటికే ఒక స్నేహితుడు రూ.20 వేలు పంపి మోసపోయారన్నారు. డబ్బు పంపాలన్న మెసేజ్‌లు ఎవరూ నమ్మవద్దని సూచించారు. అనుమానాస్పద లింకులు, మెసేజ్‌లు, వీడియో కాల్స్ బ్లాక్ చేయాలని కోరారు. ఆయా సైట్లు బ్లాక్ చేసి పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు. సైబర్ మోసాలపై 1930 నంబర్‌లో ఫిర్యాదు చేయాలని సజ్జనార్ సూచించారు.

# నౌగామ్ పేలుడు ఉగ్రకుట్ర కాదు

**కేంద్ర హోం మంత్రిత్వశాఖ జాయింట్ సెక్రటరీ ప్రశాంత్ లోఖండే స్పష్టం**



జమ్ముకశ్మీర్ : జమ్ముకశ్మీర్‌లోని నౌగామ్ పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం రాత్రి జరిగిన భారీ పేలుడుపై కేంద్ర హోం మంత్రిత్వశాఖ జాయింట్ సెక్రటరీ ప్రశాంత్ లోఖండే శనివారం స్పందించారు. ఈ పేలుడు ధాటికి 9మంది మరణించగా, 32మంది తీవ్రంగా గాయపడ్డారని తెలిపారు. ఈ ఘటనలో ఉగ్రకోణం ఉందనే ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో ఎంహెచ్‌ఏ వివరణ ఇచ్చింది. ఈ ఘటన ప్రమాదవశాత్తు జరిగిందని, దీనిపై ఊహాగానాలు అనవసరమని స్పష్టం చేశారు.

"హరియాణాలోని టెర్రర్ మాడ్యూల్‌పై దర్యాప్తు చేస్తున్న సమయంలో భారీ స్థాయిలో పేలుడు పదార్థాలు, రసాయనాల నిల్వలను స్వాధీనం చేసుకున్నాం. వాటిని శ్రీనగర్ శివార్లలో ఉన్న నౌగామ్ పోలీస్ స్టేషన్ ప్రాంగణంలోని బహిరంగ ప్రదేశంలో భద్రంగా ఉంచాం. తరువాత వాటిని ప్రామాణిక, నిర్దేశిత విధానంలో ఫోరెన్సిక్, రసాయన పరీక్షకు పంపాం. భారీ స్థాయిలో పేలుడు పదార్థాలు ఉండడం వల్ల గత రెండు రోజులుగా ఈ ప్రక్రియ నిరంతరంగా జరుగుతూనే ఉంది. అయితే ఆ పేలుడు పదార్థాలు చాలా సున్నితమైనవి కావడం వల్ల, నిపుణుల పర్యవేక్షణలో వాటిని జాగ్రత్తగా నిర్వహిస్తున్నాం. అయితే నవంబర్ 14 రాత్రి 11.20 గంటల సమయంలో ప్రమాదవశాత్తు భారీ పేలుడు సంభవించింది. ఈ దురదృష్టకరమైన ఘటనలో 9 మంది ప్రాణాలు కోల్పోగా, 27 మంది పోలీసు సిబ్బంది, ఇద్దరు రెవెన్యూ అధికారులు, ముగ్గురు పౌరులు గాయపడ్డారు. పేలుడు ధాటికి పోలీస్ స్టేషన్ తీవ్రంగా దెబ్బతింది. చుట్టుపక్కల ఉన్న కొన్ని భవనాలు కూడా దెబ్బతిన్నాయి. పేలుడుకు గల కారణాలను పరిశీలిస్తున్నారు. దీనిపై ఊహాగానాలు అనవసరం " అని ఆయన తెలిపారు.

# మోసం ఆయన నైజం



## 15 మంది ఇండిపెండెంట్లు ఎవరికి మద్దతివ్వాలని హరీష్‌ను అడిగారు

**ఆయన మీ ఇష్టం అన్నారు ..**

**కేటీఆర్ సోషల్ మీడియా వదిలి బయటకు రావాలి**

**జాగృతి అధ్యక్షురాలు కవిత విమర్శలు**

మెదక్: బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావుపై జాగృతి అధ్యక్షురాలు, కవిత తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. మోసం చేయడమే ఆయన నైజమని, పార్టీలో ఉంటూనే ద్రోహం చేశారని ఆమె ఆరోపించారు. శనివారం మెదక్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో కవిత మాట్లాడుతూ... బీఆర్ఎస్ ఓటమికి కారణం తాను కాదని తప్పించుకోవడం హరీశ్‌రావుకు అలవాటని, ఆయన గురించి గట్టిగా మాట్లాడినందుకే తనను పార్టీ నుంచి బయటకు పంపారని గుర్తుచేశారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నికను ప్రస్తావిస్తూ, 15 మంది ఇండిపెండెంట్లు ఎవరికి మద్దతివ్వాలని తనను అడిగితే తనకు సంబంధం లేదని చెప్పానని, అయితే వారే హరీశ్‌రావు వద్దకు వెళ్లగా 'మీ ఇష్టం' అని ఆయన సమాధానమిచ్చారని కవిత ఆరోపించారు. తాను బీఆర్ఎస్‌లో లేను కాబట్టి దూరంగా ఉన్నానని, కానీ పార్టీలో కీలక నేతగా ఉన్న హరీశ్‌రావు ఇలా వ్యవహరించడం మోసం చేయడమేనని అన్నారు. కేటీఆర్, హరీశ్‌రావు పేరుకే కృష్ణార్జునులని, ట్వీట్లు చేసుకోవడం తప్ప క్షేత్రస్థాయిలో పనిచేయడం లేదని విమర్శించారు.

బీఆర్ఎస్ నేతలు తమ ఆస్తులు పెంచుకున్నారు కానీ, పార్టీ కేడర్‌ను పెంచుకోలేదని కవిత దుయ్యబట్టారు. జగదీశ్ రెడ్డి, మదన్ రెడ్డి, నిరంజన్ రెడ్డి వంటి వారికి వందల కోట్లు ఎలా వచ్చాయని ప్రశ్నించారు. ఒకప్పుడు కేసీఆర్‌ను తీవ్రంగా విమర్శించి పార్టీని వీడిన పద్మా దేవేందర్‌రెడ్డికి ఇప్పుడు హరీశ్‌రావు ఎందుకు మద్దతిస్తున్నారని నిలదీశారు. మరోవైపు, ప్రస్తుత ప్రభుత్వం గ్రూప్-1 ఉద్యోగాల కల్పనలో విఫలమైందని, యువతకు అన్యాయం చేస్తోందని విమర్శించారు. హరీశ్‌రావు బినామీలకు, వారి కంపెనీలకు ముఖ్యమంత్రితో సంబంధాలున్నాయని కూడా ఆమె ఆరోపించారు.

# సీఐడీ విచారణకు రానా, విష్ణుప్రియ

**బెట్టింగ్ యాప్ ప్రచారం కేసు**





హైదరాబాద్: బెట్టింగ్ యాప్‌ల ప్రచారం కేసులో భాగంగా నటుడు రానా , యాంకర్ విష్ణుప్రియ సీఐడీ సిట్ విచారణకు హాజరయ్యారు. ఆయా యాప్‌ల ప్రచారానికి సంబంధించిన వివరాలపై అధికారులు వారిని వేర్వేరుగా ప్రశ్నిస్తున్నట్టు సమాచారం. రాష్ట్రంలో బెట్టింగ్ యాప్‌ల నిర్వాకాలపై దర్యాప్తు జరిపేందుకు ప్రభుత్వం సీఐడీ ఆధ్వర్యంలో ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్)ను ఏర్పాటు చేసింది. బెట్టింగ్ యాప్‌లను ప్రమోట్ చేసిన సెలబ్రిటీలపై కొన్ని నెలల క్రితం కేసు నమోదైన సంగతి తెలిసిందే. ఇప్పటికే ప్రకాశ్‌రాజ్ తదితరులను సిట్ విచారించడం విదితమే.




# బొమ్మ తిరగబడింది!

**ఐ బొమ్మ నిర్వాహకుల్లో ఒకరి అరెస్ట్**

**అతడి ఖాతాలోని రూ.3 కోట్లు ఫ్రీజ్**

**కరేబియన్ దీవుల్లో ఉంటూ వెబ్‌సైట్ నిర్వహణ**

హైదరాబాద్: : ఐ బొమ్మ నిర్వాహకుల్లో ఒకరైన నిందితుడు ఇమ్మడి రవిని పోలీసులు అరెస్టు చేశారు. అతడిని కూకట్‌పల్లిలో సైబర్‌క్రైమ్ పోలీసులు అరెస్టు చేశారు. భార్యతో విడాకులు తీసుకుని ఒంటరిగా ఉంటున్న ఇమ్మడి రవి, కరేబియన్ దీవుల్లో ఉంటూ ఐ బొమ్మ వెబ్‌సైట్ నిర్వహణ చూసుకుంటున్నారు. శుక్రవారం ఫ్రాన్స్ నుంచి హైదరాబాద్‌కు వచ్చాడు. విషయం తెలుసుకున్న పోలీసులు అరెస్ట్ చేసి, అతడి బ్యాంకు ఖాతాలోని రూ.3 కోట్లను ఫ్రీజ్ చేశారు. అనంతరం సర్వర్లు లాగిన్ చేయించి ,పైరసీ కంటెంట్‌ను పోలీసులు తనిఖీ చేశారు. ఓటీటీ కంటెంట్, తెలుగు సినిమాల పైరసీ విషయంలో గతంలో ఐ బొమ్మపై తెలుగు ఫిలిం యాంటీ పైరసీ టీమ్ ఫిర్యాదు చేసింది. దమ్ముంటే పట్టుకోవాలంటూ గతంలో ఐ బొమ్మ నిర్వాహకులు సవాల్ కూడా విసిరారు.

**సినిమా ఇండస్ట్రీకి రూ.3,700 కోట్లు నష్టం**

: సినిమా పరిశ్రమకు పెను సవాల్‌గా మారిన పైరసీ భూతాన్ని తరిమికొట్టాలని సైబర్ క్రైమ్ పోలీసులు భావిస్తున్నారు. తెలుగు, ఇతర భాషల్లోని సినిమాలను పైరసీ చేస్తూ సినిమా ఇండస్ట్రీకి దాదాపు రూ.3,700 కోట్లు నష్టం జరిగిందని పోలీసులు తెలిపారు. గతంలో హ్యాష్ ట్యాగ్ సింగిల్ సినిమా పైరసీపై పోలీసులకు కంప్లైంట్ అందింది. ఆ పైరసీ ముఠా సభ్యులు నెదర్లాండ్, దుబాయి, మయన్మార్‌లో ఉన్నట్లు గుర్తించారు.

# 24 గంటల్లోపే కాంగ్రెస్ గూండాయిజం

**బీఆర్ఎస్ వర్కింగ్‌ప్రెసిడెంట్ కేటీఆర్**


**జూబ్లీహిల్స్‌లో కార్యకర్తపై జరిగిన దాడికి ఖండన**



హైదరాబాద్: ఫలితాలు వచ్చి 24 గంటలు దాటక ముందే కాంగ్రెస్ గూండాయిజం చేస్తోందని బీఆర్ఎస్ వర్కింగ్‌ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. జూబ్లీహిల్స్‌లో తమ కార్యకర్తపై జరిగిన దాడిని ఖండించారు. రహమత్‌నగర్‌లో తమ పార్టీ కార్యకర్త రాకేశ్‌ను పరామర్శించిన అనంతరం ఆయన మాట్లాడారు. తాము కూడా అనేక ఎన్నికల్లో గెలిచామని.. కానీ ఇలా దాడులు చేయలేదన్నారు. "విజయ గర్వంతోనే కాంగ్రెస్ వాళ్లు శుక్రవారం ఊరేగింపు నిర్వహించారు. భారత రాష్ట్ర సమితి కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటాం. దాడికి హస్తం పార్టీ పూర్తిగా బాధ్యత వహించాలి. దొంగ ఓట్లు, గూండాగిరి, డబ్బులు పంచి జూబ్లీహిల్స్‌లో గెలిచారు. కాంగ్రెస్ గూండాయిజం కొనసాగితే ప్రజలే బుద్ధి చెబుతారు" అని కేటీఆర్ హెచ్చరించారు. రహమత్ నగర్‌లో బీఆర్ ఎస్ రాకేశ్‌పై కాంగ్రెస్ కార్యకర్తలు దాడి చేసిన ఘటన కలకలం రేపింది. తీవ్ర గాయాలపాలైన ఆయనకు ఎస్ఆర్ నగర్‌లోని ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స జరుగుతోంది. ఈ ఘటనపై మధురానగర్ పోలీసులు కేసు నమోదు చేశారు.

# రాహుల్ గాంధీతో సీఎం రేవంత్ భేటీ

**కాంగ్రెస్ నేతల బృందంలో.. జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ కూడా..**



ఢిల్లీ : తెలంగాణ కాంగ్రెస్ నేతల బృందం ఢిల్లీకి వెళ్లారు. పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీతో సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి, టీపీసీసీ చీఫ్ మహేష్ గౌడ్, ఎమ్మెల్యే నవీన్ యాదవ్ భేటీ అయ్యారు. తెలంగాణలో ప్రస్తుత రాజకీయ పరిణామాలపై చర్చిస్తున్నట్లు తెలుస్తోంది. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక రిజల్ట్స్, స్థానిక సంస్థల ఎన్నికలపై చర్చ జరిగినట్లు సమాచారం. సాయంత్రం 6 గంటలకు ఖర్గేతో కూడా టీ-కాంగ్రెస్ శ్రేణులు సమావేశం కానున్నట్లు తెలిసింది.